RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

WANTED
ప్రభాత సూర్యుడు
www.prabhathasuryudu.com
రిపోర్టర్స్ కావలెను
తెలుగు పత్రికారంగ చరిత్రలో ఒక కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టి సమకాలీన అంశాలను సంక్షిప్తంగా అందిస్తూ... ప్రజాదరణ పొందుతున్న ప్రభాత సూర్యుడు జాతీయ దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా ఇన్‌ఛార్జీలు, నియోజకవర్గాలు, మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను.
prabhathasuryudueditor@gmail.com
https://youtube.com/@UstudioTV
94940 54338

RANGAREDDY, EDITION : 01, VOLUME :170 EDITOR: CHERUKU UPENDAR, DATE : SATURDAY 04 NOVEMBER 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 170 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : శనివారం 04 నవంబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-

# మాయమాటలతో ఆగం కావొద్దు

## ప్రజా ఆశీర్వాద సభల్లో ముఖ్యమంత్రి కేసీఆర్



ఆదిలాబాద్-- ప్రభాత సూర్యుడు

బీజేపీ పార్టీకి రాష్ట్రంలో ఓట్లు అడిగే అర్హత లేదని వ్యాఖ్యానించారు. దేశాన్ని, రాష్ట్రాన్ని 50 ఏండ్ల పాటు పాలించిన కాంగ్రెస్ పార్టీ.. దళితుల అభివృద్ధి గురించి ఆలోచించి ఉంటే వారికి ఈ పరిస్థితి ఉండేదా అని ప్రశ్నించారు. పార్టీలు చెప్పే మాయమాటలు నమ్మి మోసపోద్దని, ఆయా పార్టీల చరిత్ర చూసి ఓటేయ్యాలని పిలుపునిచ్చారు. శుక్రవారం ముధోల్, కోరుట్ల, ఆర్మూర్ నియోజకవర్గాల్లో నిర్వహించిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్ పాల్గొని మాట్లాడారు. భైంసా అంటేనే అన్ని అబద్ధాలు చెప్పారని, ఇక్కడ హిందూ, ముస్లింలు ఏండ్లుగా కలిసి బతుకుతున్నారని తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75ఏండ్లు గడిచిపోయినా ఎన్నికలు రాగానే అబద్దాలు, అబండాలు సహజమైపోయాయని, ప్రజాస్వామానికి ఇంకా పరిణతి రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రైతుబంధు దుబారా అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెబుతుండగా.. 3 గంటలు కరెంటు చాలు అని రేవంత్‌రెడ్డి చెబుతున్నారని, ఇది సరైన పద్దతేనా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పక్కనున్న మహారాష్ట్ర రైతులు ఇక్కడ బోర్లు వేసి అక్కడ పంటలు పండిస్తున్నారు. అక్కడి కంటే ఇక్కడి రోడ్ల పరిస్థితి చాలా మెరుగ్గా ఉందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం

మిగతా 2లో



# ఉద్యమం.. ఉధృతం

- కాంట్రాక్టు నియామకాలను రద్దు చేయాలి
- కదంతొక్కిన ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు
- మోడీ ప్రభుత్వాన్ని ఓడించటమే తక్షణ కర్తవ్యం

న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

వచ్చే లోక్‌సభ ఎన్నికలలోగా జాతీయ పెన్షన్ పథకాన్ని (ఎన్పీఎస్) రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించకుంటే కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించుతామని ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సంఘాల నేతలు హెచ్చరించారు. కాంట్రాక్టు నియామకాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం నాడిక్కడ రాంలీలా మైదానంలో కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ (సీసీజీఈడబ్ల్యూ), ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఎఐఎస్‌జీఈఎఫ్), స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్టీఎఫ్ఐ), ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ ఫెడరేషన్ (ఎఐఎస్ జీపీఎఫ్), నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్

మిగతా 2లో



## కేసీఆర్
# పాపాల పుట్ట పగిలింది

### టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ ప్రజలు కోరుకుంది స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అభివృద్ధి. కానీ రాష్ట్రం ఒక వ్యక్తి ఉక్కుపాదాల కింద నలిగిపోతోంది. అందుకే రాష్ట్ర ప్రజల కోసం నా వంతుగా నేను పోరాడుతున్నానని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం నాడు అయన బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన మీట్ ద ప్రెస్ కార్యాక్రమంలో

మిగతా 2లో

# ఎన్నికల నోటిఫికేషన్ జారీ

## మరింత కఠినంగా నియమావళి అమలు : రాష్ట్ర సీఈఓ వికాస్‌రాజ్



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. శుక్రవారం ఉదయం పది గంటలకు రిటర్నింగ్ అధికారులు ఎక్కడికక్కడ ఈ నోటిఫికేషన్లను జారీ చేశారు. 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ముఖ్య కార్యదర్శి అవినాష్ కుమార్, తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) వికాస్‌రాజ్ ఆదేశాల మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఎన్నికల నోటిఫికేషన్‌కు సంబంధించిన గెజిట్‌ను విడుదల చేశారు. అనంతరం బూర్గుల రామకృష్ణారావు భవన్‌లోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సీఈఓ వికాస్‌రాజ్ ఎన్నికల నియమ నిబంధనలు వివరించారు. ఎన్నికలు పూర్తి స్వేచ్ఛ, పారదర్శకంగా నిర్వహించేందుకు రాజకీయపార్టీలు, ప్రజలు సహకరించాలని కోరారు. రైతుబంధు విడుదలపై తమకు ఎవరి నుంచి ఎలాంటి ఫిర్యాదులు అంద లేదనీ, అదే సమయంలో దానిపై ప్రభుత్వం నుంచి కూడా ఎలాంటి ప్రతిపాదనలు రాలేదని స్పష్టంచేశారు. ఒక అభ్యర్థి గరిష్టంగా రెండు నియోజక వర్గాలనుంచి పోటీ చేయోచ్చని చెప్పారు. ఒక్కో నియోజకవర్గంలో గరిష్టంగా నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేయోచ్చనీ, డిపాజిట్ మాత్రం ఒక్కదానికే చెల్లించాలన్నారు. నామినేషన్ పత్రాలు, అఫిడవిట్‌ల దాఖలు విషయంలో అభ్యర్థులు చాలా జాగ్రత్తగా ఉండాలనీ, ఏ కాలమ్‌ను ఖాళీగా

మిగతా 2లో

## ఎన్నికల పోటీకి
# దూరంగా ఉంటాం

### - వైఎస్ షర్మిల



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

ఈనెలాఖరున జరిగే శాసనసభ ఎన్నికలలో పోటీ చేయమని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి షర్మిల వెల్లడించారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని ఓడించడం మా ఉద్దేశ్యం కాదు, ప్రభుత్వ వ్యతిరేక ఓటు చిలనివ్వవద్దు అని ఈ నిర్ణయం తీసుకుంటున్నాం. కాంగ్రెస్ నాయకులన్నా, కార్యకర్తలన్నా తనకు అపారమైన గౌరవం ఉందని చెప్పారు. ఇటీవల ఢిల్లీలో తాను సోనియాగాంధీ, రాహుల్ గాంధీలను కలిసినప్పుడు...

మిగతా 2లో



# ఎంఐఎం తొలి జాబితా

- తొమ్మిది స్థానాల్లో పోటీకి నిర్ణయం
- 6 స్థానాల్లో అభ్యర్థుల ప్రకటన
- పార్టీ అధినేత అసదుద్దీన్ వెల్లడి

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ ఎన్నికల అభ్యర్థుల తొలి జాబితాను ఎంఐఎం విడుదల చేసింది. శుక్రవారం దారుసలాంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసీ 6 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. మొత్తం 9 స్థానాల్లో పోటీ చేస్తున్నామని, సిట్టింగ్ స్థానమైన బహదూర్ పురాతో పాటు రాజేంద్ర నగర్, జూబ్లిహిల్స్ స్థానాల్లో

మిగతా 2లో

# నామినేషన్లు షురూ




హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మొదటి రోజు శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా వంద నామినేషన్లు దాఖలైనట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి కార్యాలయం తెలిపింది. తొలిరోజు నామినేషన్లు వేసిన వారిలో కొడంగల్ నియోజకవర్గం నుంచి నామినేషన్ పత్రాలు అందజేశారు. ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తుమ్మల నాగేశ్వరరావు నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఎక్కువగా స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు వేశారు. నామినేషన్ల కేంద్రాల వద్ద సీఆర్పీఎఫ్ బలగాలతో పాటు పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. నామినేషన్లు వేసే అభ్యర్థులతో పాటు ప్రతిపాదించే వారిని మాత్రమే అనుమతించారు.

హైదరాబాద్ గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిగా మొగిలి సునీత నామినేషన్ దాఖలు వేశారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లో ఎనిమిది నామినేషన్లు దాఖలయ్యాయి. నిర్మల్ నియోజకవర్గంలో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి రెండు సెట్ల నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అంద జేశారు. ము థోల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి నారాయణరావు పటేల్, బెల్లంపల్లిలో బీజేపీ అభ్యర్థి అమురాజుల శ్రీదేవి నామినేషన్ దాఖలు చేశారు. చెన్నూర్‌లో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి సోగాల సంజీవ్, సిర్పూర్(టి) నుంచి కాంగ్రెస్ అభ్యర్థి రావి శ్రీనివాస్ నామినేషన్ పత్రాలు అందజేశారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం నియోజకవర్గంలో ఆజాద్ అధికార సేన పార్టీ బలపరుస్తున్న ఇమంది ఉదరు కుమార్ నామినేషన్ దాఖలు చేశారు. పాలేరు నియోజకవర్గ ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థిగా శ్రీ పసుపులేటి శ్రీనివాసరావు నామినేషన్ వేశారు.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మొదటి రోజు 12 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. రంగారెడ్డిలో 7 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా.. వికారాబాద్ జిల్లాలో 5 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. కాంగ్రెస్ అభ్యర్థులు ఎక్కువగా నామినేషన్లు దాఖాలు చేశారు. వికారాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్, శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్‌గౌడ్ నామినేషన్లు వేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 11 నామినేషన్లు దాఖలయ్యాయి. వరంగల్ తూర్పులో బీజేపీ అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు నామినేషన్ వేశారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా 2 సెట్ల నామినేషన్ పత్రాలు అందజేశారు. బీజేపీ పార్టీ తరుపున భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా చందుపట్ల కీర్తిరెడ్డి నామినేషన్ దాఖలు వేశారు. భూపాలపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గండ్ర సత్యనారాయణరావు తరపున ఆయన సతీమణి గణపురం జెడ్పీటీసీ గండ్ర పద్మ నామినేషన్ దాఖలు చేశారు. నర్సంపేట నియోజకవర్గం నుంచి ఎంసీపీఐ(యు) అభ్యర్థి పెద్దారపు రమేష్ నామినేషన్ దాఖలు చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 15 నామినేషన్లు దాఖలు అయినట్టు రిటర్నింగ్ అధికారులు తెలిపారు.

# ఉద్యమం.. ఉధృతం




(మొదటిపేజీ తరువాయి)
పెన్షనర్ల అసోసియేషన్ (ఎన్సీసీపీఏ) సంఘాలు సంయుక్తంగా నిర్వహించిన చేతావనీ ర్యాలీలో దేశ నలుమూలల నుంచి వేలాది మంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు పాల్గొన్నారు. "ఎన్పీఎస్ రద్దు చేయాలి, ఓపీఎస్ పునరుద్ధరించాలి, ఎన్ఈపీని వెనక్కి తీసుకోవాలి" అంటూ డిమాండ్ చేస్తూ ఇంగ్లీష్, హిందీ భాషలతో పాటు ప్రాంతీయ భాషల్లో డిమాండ్లతో కూడిన ప్లకార్డులు, బ్యానర్లు చేబూని దేశ రాజధాని ఢిల్లీల్లో కదంతొక్కారు. మోడీ సర్కార్ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు హోరెత్తించారు. అనంతరం ఉద్యోగ సంఘ నేత సుభాష్ లాంబ, ఉపాధ్యాయ సంఘం నేత సిఎన్ భార్తి అధ్యక్ష వర్గంగా నిర్వహించిన భారీ బహిరంగ సభలో సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రయివేటీకరణ విధానాలను తీవ్రంగా ఎండగట్టారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ, పెన్షన్ ప్రయివేటీకరణకు మూలకారణమైన మోడీ ప్రభుత్వాన్ని ఓడించటమే తక్షణ కర్తవ్యం అని అన్నారు. అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి ఏ. శ్రీకుమార్ మాట్లాడుతూ పీఎఫ్ఆర్డీఏను రద్దు చేయాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణను మానుకోవాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనాలు ఇవ్వాలని, వారిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్టీఎఫ్ఐ) అధ్యక్షుడు కె ఎస్ హరికృష్ణ మాట్లాడుతూ విద్యలో కేంద్రీకరణ, వ్యాపారీకరణ, కాషాయీకరణలకు దోహదపడుతున్న జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల నేతలు ఎస్బి యాదవ్, రూపక్ సర్కార్, సిఎన్ భారతి, అశోక్ తులే, కె రాఘవేంద్రన్ మాట్లాడారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఎస్టీఎఫ్ఐ అనుబంధ సంఘం యూటీఎఫ్ ఆధ్వర్యంలో వందలాది మంది ఉపాధ్యాయులు చలో ఢిల్లీలో పాల్గొన్నారు. ఎస్టీఎఫ్ఐ ఉపాధ్యక్షులు, టీఎస్ యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి చావ రవి, మహిళా విభాగం అధ్యక్షురాలు ఎం. సంయుక్త, రాష్ట్ర అధ్యక్షులు కె. జంగయ్య, ఉపాధ్యక్షులు సిహెచ్ దుర్గాభవాని, కోశాధికారి టి. లక్ష్మారెడ్డి, కార్యదర్శులు శాంతికుమారి, నాగమణి, రవికుమార్, మాణిక్ రెడ్డి, వెంకటప్ప, వెంకటేష్, గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ పాపాల పుట్ట పగిలింది

(మొదటిపేజీ తరువాయి)
పాల్గోన్నారు. రేవంత్ మాట్లాడుతూ చరిత్ర చెప్పాలంటే క్రీస్తు పూర్వం.. క్రీస్తు శకం అని చెబుతాం. అలగే మన రాష్ట్రం గురించి చెప్పాలంటే తెలంగాణ వచ్చాక, తెలంగాణ రాకముందు అని చెప్పుకోవాలి. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారు. రాజకీయంగా నష్టపోతామని తెలిసినా.. ధర్మం వైపు నిలబడాలని రాష్ట్రం ఇచ్చారు. తెలంగాణ ప్రజలు కోరుకుంది స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అభివృద్ధి. కానీ రాష్ట్రం ఒక వ్యక్తి ఉక్కుపాదాల కింద నలిగిపోతోందని అన్నారు. లెక్కలు వేసుకుని, స్వార్థం చూసుకుంటే వంద మంది కేసీఆర్ లు వచ్చినా తెలంగాణ ఏర్పడేది కాదు. శ్రీకాంతాచారి లాంటి అమరుల త్యాగాలను గుర్తించి సోనియా తెలంగాణ ఇచ్చారు. దశాబ్దం గడిచినా నీళ్లు, నిధులు నియామకాలు సాధించుకున్నమా? ఒకసారి ఆలోచన చేయాలి. టీఆరెస్ ను పోలి ఉండేలా ఉండేందుకే వాహనాలకు టీజీ బదులు టీఎస్ అని పెట్టారు. రాష్ట్ర అధికారిక ముద్ర రాజరిక పోకడను తలపిస్తోంది. త్యాగాలను గుర్తు చేసేలా ఉండాల్సిన చిహ్నం రాచరికాన్ని తలపిస్తోంది. తెలంగాణ ప్రతీ తల్లి ప్రతీకలా తెలంగాణ తల్లి ఉండాలి. కానీ శ్రీమంతులు తెలంగాణ తల్లిని మనకు కేసీఆర్ చూపిస్తుండు. త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణలో రచరికపోకడ కొనసాగుతోంది.తెలంగాణలో ప్రజాస్వామ్యం లోపించింది. ప్రజల హక్కులను కేసీఆర్ కాలరాశారు. రాష్ట్రంలో అందరినీ వర్గ శత్రువులా కేసీఆర్ చూస్తున్నారు. ఎన్నుకున్న ప్రభుత్వానికి ప్రజలు తమ బాధలు చెప్పుకోలేని పరిస్థితి. గతంలో పాలకులు ప్రజలకు సచివాలయంలో అందుబాటులో ఉండేవారు. కానీ ఇవాళ ప్రతిపక్ష నేతలకు, జర్నలిస్టులకు సచివాలయంలోకి ప్రవేశం లేదు. కేసీఆర్ నియంత ముసుగులో ఉన్న క్రిమినల్ పొలిటీషియన్. మార్పు జరగకుండానే ఉద్యమకారుల జీవితాలు తారుమారయ్యాయి. ఆత్మహత్య చేసుకున్న యువతులపై ప్రభుత్వమే తప్పుడు ప్రకటనలు చేస్తున్న పరిస్థితి. కేసీఆర్ పాపాల పుట్ట పగిలింది.. మేడిగడ్డ కుంగింది. కేసీఆర్ ఇచ్చిన ఏ హామీనీ ఈ పదేళ్లలో నెరవేర్చలేదు. ప్రజలని మోసం చేసిన కేసీఆర్ లాంటి మోసగాళ్లకు తెలంగాణలో స్థానం లేదు. పదేళ్లలో ఎవరి భవిష్యత్ బాగుపడింది.. ఎక్కడ బంగారు తెలంగాణ? కర్ణాటకలో కాంగ్రెస్ గెలవద్దని ప్రచారం చేశారు.. అంటే పరోక్షంగా కేసీఆర్ కోరుకుంది మోదీ గెలుపేనా అని అన్నారు. బీఆరెస్ నేతలవి లాజిక్ లేని వాదనలు.కేసీఆర్ తాను చేసింది చెప్పుకోలేక కాంగ్రెస్ నపై ఆరోపణలు చేస్తున్నారు. కేసీఆర్ వాదనల్లో డొల్లతనం స్పష్టంగా కనిపిస్తోంది. కాంగ్రెస్ ఎప్పుడూ మైనారిటీలను కేవలం ఓటు బ్యాంకుగా చూడలేదు. రైతులకు ఎకరానికి ఏటా 10వేలు ఇస్తామని 2014లోనే కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టింది. దాన్నే కాపీ కొట్టి కేసీఆర్ రైతు బంధు పేరుతో ఇస్తున్నారని అన్నారు.

# మాయమాటలతో ఆగం కావొద్దు

(మొదటిపేజీ తరువాయి)
గతంలో ఆగమాగం ఉండేదని, వ్యవసాయ స్థిరీకరణ చేయాలని నిర్ణయించామని తెలిపారు. కాంగ్రెస్ వస్తే ధరణి తీసేస్తామని చెబుతున్నారని, ఈ పోర్టల్ లేకపోతే మళ్లీ దళారుల రాజ్యం వస్తుందని చెప్పారు. గతంలో గడ్డెన్నవాగు ప్రాజెక్టు ద్వారా 4వేల ఎకరాలకు నీరందించేవారని, ఇప్పుడు 12వేల ఎకరాలకు సాగునీరందుతోందని తెలిపారు. రైతుబంధు సాయంతో రైతులు అప్పులు తీర్చుకుంటున్నారని, కాంగ్రెస్ హయాంలో ఎరువులు, విత్తనాలు పోలీస్‌స్టేషన్‌లో లభించేవని, ఇప్పుడా పరిస్థితి లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎలాంటి కర్ఫ్యూ, కరువు లేకుండా కులం, మతం అన్న భేదం లేకుండా అందరూ సమానంగా బతుకుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, మరోసారి ముధోల్ ఎమ్మెల్యేగా విఠల్‌రెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. సభలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపీ దామోదర్‌రావు, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ ఎంపీ గోడం నగేష్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, మాజీ జడ్పీ చైర్మెన్ లోలం శ్యాంసుందర్, డా.రమాదేవి పాల్గొన్నారు. బీడీ కార్మికులకు దేశంలో ఏ రాష్ట్రంలో కూడా పెన్షన్ ఇవ్వడం లేదని, తెలంగాణ మాత్రమే పెన్షన్ ఇస్తున్నట్టు తెలిపారు. గత పాలనలో కోరుట్ల, సిరిసిల్ల, పోచంపల్లిలో చేనేత కార్మికుల ఆత్మహత్యలు ఉండేవని, తాము అధికారంలోకి వచ్చిన తరువాత చేనేత కార్మికులకు సబ్సిడీలు ఇస్తూ వారికి భరోసా కల్పించామని గుర్తు చేశారు. ధరణి ఆధారంగానే రైతుబంధు, రైతుబీమా అందిస్తున్నామని, ధరణి లేకుంటే అవి ఎలా సాధ్యమవుతాయని ప్రశ్నించారు.

ధరణి ఉండాలంటే బీఆర్ఎస్‌ను మళ్లీ గెలిపించాలన్నారు. రాష్ట్రంలో వ్యవసాయానికి తాము 24 గంటల కరెంట్ అందిస్తుంటే, కాంగ్రెస్ వాళ్ళు 3 గంటలు సరిపోతుందని అంటున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో నెంబర్‌వన్ అయిందన్నారు. రాష్ట్రంలో వ్యవసాయానికి సాగునీటి ఇబ్బంది లేకుండా బీఆర్ఎస్ చేసిందని తెలిపారు. గ్రామాలు, వార్డుల్లో జరిగిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని సీఎం అభ్యర్థించారు. దేశాన్ని, రాష్ట్రాన్ని 50 ఏండ్లపాటు పాలించిన కాంగ్రెస్ ప్రజలకు ఏం మేలు చేసిందని సీఎం కేసీఆర్ ప్రశ్నించారు. రైతుబంధు దుబారా అని కాంగ్రెస్ నేతలు అంటున్నారని, రైతులకు 24 గంటల కరెంట్ అవసరం లేదంటున్న ఇలాంటి పార్టీ మనకు అవసరమా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాకముందు, వచ్చాక చేసిన అభివృద్ధి ప్రజలకు కండ్లముందే కనబడుతుందని, నా బావ చెప్పిండు.. బంధువు చెప్పిండని కాకుండా.. ఆలోచన చేసి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. రాష్ట్ర ఆదాయం పెరిగేకొద్దీ సంక్షేమ పథకాలు పెంచుతున్నామని చెప్పారు. తెలంగాణ కోసమే బీఆర్ఎస్ పుట్టిందన్న కేసీఆర్.. ఆర్మూర్ నియోజకవర్గ అభ్యర్థి జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ప్రజలకు మేలు చేసేది బి.ఆర్.ఎస్ ప్రభుత్వమే అని వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలంతా బ్రహ్మాస్త్రాన్ని సంధించాలంటూ పిలుపునిచ్చారు.

# ఎంఐఎం తొలి జాబితా

(మొదటిపేజీ తరువాయి)
అభ్యర్థులను త్వరలో ప్రకటిస్తామని వెల్లడించారు. పోటీ చేస్తున్న తొమ్మిది నియోజక వర్గాల్లో ఎంఐఎంకు పట్టం కట్టాలని ఆయన ఓటర్లను కోరారు. కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని,మరోసారి తెలంగాణలో ఎవ్వరి మద్దతు లేకుండా బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని తెలిపారు.రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్‌కు మద్దతు ఇస్తున్నప్పటికి రాజేంద్రనగర్‌లో ప్రకాష్ గౌడ్ జూబ్లీహిల్స్‌లో మాగంటి గోపీనాథ్‌లను ఓడగొడతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని పగటి కలలు కంటోందని విమర్శించారు. బీజేపీ బీసీ ముఖ్యమంత్రి ప్రకటన పెద్ద జోక్ అని కొట్టి పారేసారు. బాబ్రీ మసీద్ కూల్చివేత పాపంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్‌తో పాటు కాంగ్రెస్ పాత్ర కూడా ఉందని సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆరే నిజమైన సెక్యులర్ వాది అని కితాబు నిచ్చారు. సెక్రటేరియట్‌లో కూల్చిన మసీద్‌ను కేసీఆర్ సర్కార్ కొత్తగా నిర్మించి ముస్లింల మనోభావాలను కాపాడిందని గుర్తు చేశారు. ఇద్దరు సిట్టంగ్‌లకు మొండి చెయ్యిఎంఐఎం పార్టీ 2018లో పోగా వేసిన ఏడు సిట్టింగ్ స్థానాల్లో శుక్రవారం 6 స్థానాల అభ్యర్థులను ప్రకటించింది. ఇందులో ఇద్దరు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మొండి చెయ్యిచ్చింది. చార్మినార్ నుంచి గెలిచిన ముంతాజ్ ఖాన్, యాకత్ పురా నుంచి గెలిచిన పాషా ఖాద్రిలను వయోభారం దృష్ట్యా తప్పిస్తామని గతంలోనే ఎంఐఎం ప్రకటించింది. ఆ స్థానాల్లో మాజీ మేయర్ మాజిద్ హుస్సేన్, అక్బరుద్దీన్ కుటుంబం నుంచి కొడుకు లేదా కూతురికి అవకాశం కల్పించనున్నట్టు పార్టీ వెల్లడించింది. అయితే అన్యూహంగా అక్బరుద్దీన్ కుటుంబం నుంచి కాకుండా మరో మాజీ మేయర్ జుల్ఫీకర్ అలీ అహ్మద్‌కు చార్మినార్ టికెట్ కేటాయించారు. సెకండ్ లిస్టులో ఓవైసీ కుటుంబం నుంచి ఒకరికి అవకాశం కల్పించేందుకే మరో సిట్టింగ్ స్థానమైన బహదూర్ పుర టికెట్‌ను ఆపినట్టు తెలుస్తోంది.

**ప్రకటించిన అభ్యర్థుల వివరాలు**

1). చార్మినార్– జుల్ఫేఖర్ అహ్మద్
2). చాంద్రాయణ గుట్ట–అక్బరుద్దీన్ ఓవైసీ
3). మలక్ పేట్ –అహ్మద్ బలాల
4). నాంపల్లి –మాజిద్ హుస్సేన్
5). కార్వాన్ – కౌజర్ మోహినుద్దీన్
6). యాకత్ పుర – జాఫర్ హుస్సేన్ మీరజ్.

# ఎన్నికల నోటిఫికేషన్ జారీ

(మొదటిపేజీ తరువాయి)
వదలకూడదని వివరించారు. నవంబర్ 30న జరిగే పోలింగ్ 13 నియోజకవర్గాల్లో సాయంత్రం 4 గంటల వరకు, మిగతా చోట్ల 5 గంటల వరకు జరుగుతుందని చెప్పారు. అక్టోబరు 31వ తేదీ వరకు వచ్చిన ఓటు హక్కు దరఖాస్తులను నవంబరు 10వ తేదీ వరకు పూర్తి చేస్తామన్నారు. ఆ తర్వాతే ఇంటింటికీ పోల్ స్లిప్‌ల పంపిణీ ఉంటుందన్నారు. ఇప్పటి వరకు రెండు వేల పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేశామనీ, 1500 కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న ప్రాంతాల్లో అదనంగా పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం తక్కువగా ఉంటున్నదనీ, దాన్ని పెంచేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకోవాలనీ, వారికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఉన్నా, నేరుగా పోలింగ్ బూత్‌లకు వచ్చి ఓట్లు వేసేందుకు అవసరమైన ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. 18వేల వీల్‌ఛైర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వృద్ధులు, వికలాంగుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఉంటాయన్నారు. రాష్ట్రంలో 9 లక్షల 10వేల 810 మంది యువ ఓటర్లు ఉన్నారనీ, వారందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నవంబర్ 2 తేదీ నాటికి మొత్తం ఓటర్ల సంఖ్య 3 కోట్ల 21 లక్షల 88 వేల753గా ఉన్నదని పేర్కొన్నారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు రూ.453 కోట్ల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నామనీ, 362 కేసులు, 256 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని తెలిపారు. సీ–విజిల్ యాప్ ద్వారా 2,487 ఫిర్యాదులు వచ్చాయన్నారు. ప్రగతిభవన్‌కు తామిచ్చిన నోటీసులకు సమాధానం ఇచ్చారనీ, దాన్ని కేంద్ర ఎన్నికల సంఘానికి పంపామని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. అలాగే వివిధ రకాల అనుమతుల కోసం 9,630 దరఖాస్తులు వచ్చాయన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా 205 చెక్ పోస్టులు ఏర్పాటు చేశామనీ, స్వాధీనం చేసుకున్న నగదుకు ఆధారాలు ఉంటే జిల్లా కమిటీల ద్వారా త్వరగా విడుదల చేయాలని ఆదేశించామని చెప్పారు. ఇప్పటివరకు 137 ఎన్నికల నియమావళి ఉల్లంఘన కేసులు నమోదు అయ్యాయనీ, వాటిలో 13 బీఆర్ఎస్, 16 కాంగ్రెస్, ఐదు బీజేపీ, మూడు బీఎస్పీకి సంబంధించి అనుమానిత కేసులు ఉన్నాయని వివరించారు. ప్రలోభాలను కట్టడి చేయాలన్నదే ఎన్నికల సంఘం లక్ష్యమనీ, రెవెన్యూ ఇంటెలిజెన్స్ సమాచారం ఆధారంగా ఆయా విభాగాల చర్యలు తెలుసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పర్యవేక్షణకు అదనంగా 375 కంపెనీల కేంద్ర బలగాలు వస్తున్నాయని తెలిపారు. ఎంపీ, దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డిపై దాడి దురదృష్టకరమనీ, దానిపై తమకు పోలీసుల నివేదిక వచ్చిందని చెప్పారు. ఎన్నికల సందర్భంగా అభ్యర్థుల భద్రతపై తగిన చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖను ఆదేశించామని అన్నారు. అనుమానాస్పద ఆన్‌లైన్ దావాదేవీలపై నిఘా ఉంచుతామనీ, దానికోసం శుక్రవారం బ్యాంకర్లతో ప్రత్యేకంగా సమావేశమై విధివిధానాలు, నిబంధనలు తెలిపామని చెప్పారు.

# ఎన్నికల పోటీకి దూరంగా ఉంటాం

(మొదటిపేజీ తరువాయి)
తనను కుటుంబ సభ్యురాలిగా వారు చూశారని తెలిపారు. మేము పోటీ చేస్తే కేసిఆర్‌కి లాభం జరుగుతుందని మేధావులు చెప్పారు . అందుకే తెలంగాణ ప్రజల కోసం తీసుకుంటున్న నిర్ణయం ఇది. కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు. తమ నిర్ణయాన్ని పార్టీ శ్రేణులందరూ అర్థం చేసుకోవాలని కోరారు. షర్మిల నిర్ణయంతో లోటస్ పాండ్‌లో కొద్దిసేపు గందరగోళం ఏర్పాడింది. తమ మనోభావాలను షర్మిల పట్టించుకోలేదని పార్టీ కార్యకర్తలు, నాయకులు వాపోయారు. పార్టీ కోసం గత కొంతకాలంగా పనిచేసినా, కనీసం ఆఖరి క్షణంలో పిలిచినా పట్టించుకోలేదని అన్నారు. రెండు వర్గాలకు చీలిన నాయకులకు, కార్యకర్తలు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. చిన్నపాటి తోపులాట చోటు చేసుకుంది. ఒక్కసారిగా పార్టీ కార్యాలయంలో వర్గ విభేదాలు భగ్గుమన్నాయి.

# బీఆర్ఎస్‌ను గెలిపిస్తే అభివృద్ధి బాధ్యత నాది: హరీశ్‌రావు

**మెదక్ - ప్రభాత సూర్యుడు:** ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిన వ్యక్తి రేవంత్‌రెడ్డి ఓ క్రిమినల్ గ్యాంగ్ అని, చంచల్‌గూడ జైల్లో 1779 నెంబర్ ఖైదీ బెయిల్ మీద తిరుగుతున్నా డని మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. శుక్రవారం సంగారెడ్డి నియోజకవర్గ ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానిక పీఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వరాష్ట్రం సాధించి తెలంగాణను దేశంలోనే నెంబర్‌వన్‌గా అభివృద్ధి చేసిన కేసీఆర్ లాంటి స్ట్రాంగ్ లీడర్ ఉండగా.. మనకు రాంగ్ లీడర్లు ఎందుకని ప్రశ్నించారు. తెలంగాణ ద్రోహులంతా జతకట్టి ఎన్నికల ముసుగులో మన దగ్గరికి వస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ గెలవాలంటే కారు గుర్తుకు ఓటేయాలని, తెలంగాణ ఓడాలంటే రేవంత్‌రెడ్డి క్రిమినల్ గ్యాంగ్‌కు ఓటేయాలన్నారు. ఏది కావాలో ప్రజలే తేల్చుకోవాలన్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా



ఈ సారి ఎన్నికల్లో తెలంగాణలో టీడీపీ అసలు పోటీయే చేయడంలేదని, షర్మిల కూడా కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించారని, ఇక పవన్ కళ్యాణ్ బీజేపీతో చేతులు కలుపుతున్నారని తెలిపారు. అనాడు సంగారెడ్డిని కర్నాటకలో కలపాలని డిమాండ్ చేసిన స్థానిక ఎమ్మెల్యే జగ్గారెడ్డి తెలంగాణ ద్రోహి అని విమర్శించారు. కాంగ్రెస్‌లో టికెట్లు అమ్మకున్నారని ఆ పార్టీ వాళ్లే గాంధీ భవన్‌లో రేవంత్‌రెడ్డి బొమ్మలు దగ్ధం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే తెలంగాణను గంపగుత్తగా అమ్ముకుంటా రని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ఉస్మానియా విద్యార్థులను అడ్డా కూలీలని, బీరుకు, బిర్యానికి అమ్ముడుపోతారని హేళన చేశారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ గెలిస్తే సంగారెడ్డి నియోజకవర్గంలో 10 వేల ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారు. సంగారెడ్డిలో బీఆర్ఎస్ అభ్యర్థి చింత ప్రభాకర్‌ను గెలిపిస్తే నియోజకవర్గం అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటానని భరోసా ఇచ్చారు. సమావేశంలో ఎర్రోళ్ల శ్రీనివాస్, టీఎన్జీఓ రాష్ట్ర మాజీ అధ్యక్షులు మామిళ్ల రాజేందర్, డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, గ్రంథాలయ చైర్మెన్ నరహరిరెడ్డి, సీడీసీ చైర్మెన్ కాసర్ల బుచ్చిరెడ్డి, మున్సిపల్ చైర్మెన్ బొంగుల రవి విజయలక్ష్మీ, వైస్ చైర్మెన్ లతా విజేయేందర్ రెడ్డి, ఎంఏ ముఖీం, మనోహర్‌గౌడ్, జెడ్పీటీసీ సునీతామనోహర్‌గౌడ్, బీరయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# ఎన్నికలల్లో డబ్బులే..డబ్బులు

తరాలు మారినా తలరాత మారడం లేదన్న విషయం ప్రతి ఒక్కరికి తెలిసిందే. ఇది ప్రభుత్వ వైఫల్యమా? లేదా ప్రజల వైఫల్యమా? నీతి, నిజాయితీ, న్యాయం పట్ల నిబద్ధత ఉన్న వారిని ఎన్నుకోకుండా, డబ్బులు ఇచ్చినవారినే ఎన్నుకోవడమే దీనంతటికి కారణంగా చెప్పవచ్చు. దీనిని బట్టి ప్రజలు అభివృద్ధి కోరుతున్నారా? అవినీతి కోరుతున్నారనేది అర్థం కానీ ప్రశ్నగా మారింది. ప్రతినిధుల నేరచరిత్ర ఎన్నికల సంఘం పరిధిలోకి చేర్చడమే కాకుండా, ఓటర్లు సరైన నాయకుడిని ఎన్నుకునే అవకాశం ఉండేలా ఎన్నికల సంఘం వెబ్‌సైట్లలో అన్ని అంశాలను పొందుపరచాలి. అప్పుడే ఓటరు సరైన నాయకుడిని ఎన్నుకునే అవకాశముంది. అంతేకాకుండా అభ్యర్థి గెలిచిన తర్వాత అవినీతికి పాల్పడినట్లైతే ఆ సమయంలో ఓటర్లు రీకాల్ చేసుకొని మరొకరిని ఎన్నుకునే వెసులుబాటు కల్పించాలి. దీనివల్ల అవినీతిని అరికట్టే అవకాశముంది. ప్రస్తుతం కొన్ని దేశాల్లో రీకాల్ సిస్టమ్ అమలులో ఉంది. ఇలాంటి దేశాలలో మాత్రమే సుపరిపాలన పరుగులు పెడుతుంది. ఇలాంటి చట్టాల కోసం యువత కృషి చేయాలి. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలి. ప్రస్తుతం 90 శాతం మంది నాయకులు అవినీతిపరులు అయితే 10 శాతం మంది నిజాయితీ గల నాయకులున్నారు. ఉదాహరణకు గుమ్మడి నర్సయ్య 5 సార్లు ఎమ్మెల్యేగా చేసినా ఇప్పటికి సాధారణ జీవితం కొనసాగించడం గొప్ప విషయం. సమాజానికి గుమ్మడి నర్సయ్య లాంటి వ్యక్తులు అవసరం. ఈరోజుల్లో ఒకసారి ఎమ్మెల్యే అయితేనే తరాలకు సరిపడా సంపాదన వెనకేసుకుంటున్నారు. గుమ్మడి నర్సయ్య లాంటి వాళ్ళు సంపాదన కోసం కాకుండా సమస్యల పరిష్కారం కోసం పోరాడిన నాయకుడు. ఇలాంటి వారిని ప్రజలు ఎందుకు ఎన్నుకోరు? ప్రజలే మోసపోతున్నారు కానీ నాయకులు మోసం చేయడం లేరన్న విషయం గమనించాలి. సమాజంలో మార్పు రావాలంటే సమస్యలపై పోరాడే నాయకుడు కావాలి. అప్పుడే పేదలకు సరైన సంక్షేమ పథకాలు అందుతాయి. ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోని సరైన నాయకుడిని ఎన్నుకోవాలి. పేదోడి కల నెరవేరాలంటే. ఓటు ఆయుధంగా ఉపయోగించిన నాడే సాధ్యపడుతుంది. అభివృద్ధి కోరుకున్నట్లైతే అభివృద్ధి చేసే నాయకున్ని ఎన్నుకోవాలి, అవినీతి కోరుకున్నట్లైతే అవినీతిపరుడైన నాయకున్ని ఎన్నుకోవాలి. ఈ రోజుల్లో అన్ని పార్టీలు డబ్బులు పంచడం మామూలే. అయితే ప్రజలు ఎవరికి ఓటు వేయాలి అనేది ఆలోచించవలసిన ప్రశ్న. డబ్బులు ఎక్కువ ఇచ్చేవాడికా? అభివృద్ధి చేయగలిగే సత్తా ఉన్న నాయకుడికా? చేతులు కాలినాక ఆకులు పట్టుకున్నట్లు ఓటు వేసే సమయంలోనే సరైన నిర్ణయం తీసుకోవాలి. సరైన నాయకున్ని ఎన్నుకోవాలంటే ప్రజల్లో ఓటు హక్కు ప్రాధాన్యత అవగాహన తప్పనిసరి. ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.ఒకప్పుడు ఎన్నికలు వస్తున్నాయంటే ప్రజలు సంతోషంగా ఓటు వినియోగించడానికి ముందడుగు వేసేవారు. కారణం ఇచ్చిన హామీలు నెరవేరుతాయని, నిరుపేదలకు చేయూత అందుతుందని. అప్పట్లో నాయకులు ఇచ్చే హామీలు అలా నమ్మదగినవిగా ఉండేవి. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు! ఒకాయన ఈసారి మేము గెలిస్తే నిత్యావసర వస్తువుల ధరలు తక్కువే ఇస్తామని, మరొకాయన మేము గెలిస్తే అంతకంటే తక్కువకు ఇస్తామని హామీలిస్తున్నారు. అది సాధ్యమయ్యే పనేనా? అనేది ఓటరు ఆలోచన చేయాల్సిన అవసరముంది. నిత్యావసర వస్తువుల ధరలు మండుతూనే ఉంటాయి. ధరలు పెరగడానికి కారణాలు వెతుకుతూ ప్రజలను మభ్య పెట్టడం తప్ప ప్రయోజనం ఉండదు. అది నాయకుల కనికట్టు మంత్రం. ఊక దంపుడు ఉపన్యాసాలు తప్ప ఉపయోగపడే ఉపన్యాసం ఒకటి ఉండదు. ఇది జగమెరిగిన సత్యం. ఓట్లు దగ్గరపడ్డాక జనాలలో వ్యతిరేకత రాకుండా ఉండటం కోసం నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించి ఓట్లు అయినాక అంతకంత పెంచడం నాయకులకు వెన్నతో పెట్టిన విద్య. అంతేకాకుండా ఓట్లకు ప్రతి గ్రామంలో మద్యం ఏరులై పారుతుంది. తాగనివాడికి కూడా తాగడం నేర్పుతారు తాగుడుకి బానిసను చేసి ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూరుస్తారు. ఓట్లేసే జనాలు ఎర్రిపప్పులు అనుకుంటారేమోగాని జనాలు తిరగబడితే అదోలా ఉంటుందన్న సంగతి నాయకులు ఎరుగరు. ఉచిత విద్య, ఉచిత ఆరోగ్యం, ఉచిత రేషన్ లాంటి పథకాలు ప్రజలకు అవసరం అంతేగాని పెన్షన్ పథకాలు పెట్టి సోమరిపోతులను చేస్తున్నారు. ఏ పని చేయక అనారోగ్యానికి గురవుతున్నారు. ప్రస్తుతం నిజాయితీ గల నాయకుడిని ఎన్నుకోవడం ఎలా అనేది ప్రజలకు పెద్ద సవాలే.. నిజాయితీ నాయకుడిని గుర్తించి ఓటు వేయాలి!

## తుది అంకానికి చేరిన రాజశ్యామల యాగం

ఎర్రవల్లి – ప్రభాత సూర్యుడు : ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో చేపట్టిన రాజశ్యామల యాగం తుది అంకానికి చేరుకుంది. యాగశాలలో ఆఖరి రోజు రాజశ్యామల అమ్మవారు నర్తన కాళి అవతారంలో దర్శనమిచ్చారు. విశాఖ శారదా పీఠాధిపతులు



స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర స్వాములు యాగ క్రతువును పర్యవేక్షిస్తున్నారు. పూర్ణాహుతి ముహూర్త సమయానికి రాజశ్యామల అమ్మవారి మంత్రాలను మూడు లక్షల సార్లు హవనం అయ్యేలా పండితులతో చర్చించారు. కుంభో ద్వాసన చేసిన అనంతరం యాగంలో మంత్రించిన జలాలను ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతులపై చల్లుతారు. అలాగే యాగ భస్మాన్ని కేసీఆర్ నుదుట దిద్దుతారు. యాగం ప్రారంభానికి ముందు కేసీఆర్ దంపతులు ధరించిన కంకణాలను యాగశాలలో కంకణ విసర్జన ద్వారా దీక్ష పూర్తవుతుంది. దీంతో రాజశ్యామల యాగం పరిసమాప్తం అవుతుంది. వేద పండితులు మహదాశీర్వచనం అందించిన తర్వాత పీఠాధిపతులు స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర స్వాములకు కేసీఆర్ పాదపూజ చేస్తారు. విశాఖ శ్రీ శారదాపీఠం నుంచి రప్పించిన రాజశ్యామల అమ్మవారి శేష వస్త్రాలను సీఎం దంపతులకు అందిస్తారు. శుభానికి సూచికగా నిలిచే పసుపు వస్త్రాలను ధరించి పండితులంతా

# శ్రీకాకుళంలో పులి.. టెన్షన్

శ్రీకాకుళం – ప్రభాత సూర్యుడు : భయం.. ఈ ఎమోషన్‌తో చాలామంది ఆడుకుంటుంటారు. ముఖ్యంగా పల్లెల్లో ఏదైనా అనుకోని, ప్రమాదకర ఘటన జరిగినప్పుడు దానిపై పుకార్లు షికార్లు చేస్తుంటాయి. తాజాగా, శ్రీకాకుళం జిల్లాలో పలాస, మందస, సోంపేట, కంచిలి, కవిటి, ఇచ్ఛాపురం మండలాల్లో పులి సంచారం విషయం లోనూ ఇదే జరుగుతోంది. ఏ చిన్న ఘటనా జరిగినా దీనికే ముడిపెడుతూ కొందరు సోషల్ మీడియాలో ఫేక్ సమాచారంతో అతి చేస్తున్నారు. అదుగో పులి అంటే ఇదిగో తోక అన్న చందంగా ప్రవర్తిస్తున్నారు. దీంతో స్థానిక ప్రజలు మరింత భయాందోళనకు గురవుతున్నారు. ఈ క్రమంలో ఫేక్ వార్తలు ప్రచారం చెయ్యకుండా పోలీసులు కట్టడి చేయాలని కోరుతున్నారు. శ్రీకాకుళం జిల్లాలో పలు మండలాల్లో పెద్ద పులి సంచారంతో ప్రజలు వణికి పోతున్నారు. గత వారం రోజులుగా పలాస, మందస, సోంపేట, కంచిలి, కవిటి, ఇచ్ఛాపురం మండలాల్లో పులి సంచరిస్తోంది. మంగళవారం రాత్రి కవిటి, కంచిలి మండలాల్లోని పలు గ్రామాల్లో ఆవులు, గేదెలపై దాడి చేసింది. కంచిలి మండలం మండపల్లిలో మాదిన హరిబాబుకు చెందిన ఆవుపై దాడి చేసి పొదల్లోకి లాక్కెళ్లింది. తీవ్రంగా గాయపడిన ఆవు మృతి చెందింది. ఉదయం తోటకు వెళ్లిన రైతు.. మృతి చెందిన ఆవును గుర్తించి అటవీ అధికారులకు సమాచారం అందించారు. సహలాలపుట్టుగలో ఆవు, కొండిపుట్టుగలో గేదె దూడపై పులి దాడి చేయడంతో అవి మృతి చెందాయి. గుజ్జుపుట్టుగ గ్రామంలో ఆవు దూడకు తీవ్ర



గాయాలయ్యాయి. అటవీ శాఖ అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. ఇచ్ఛాపురం మండలం తిప్పనపుట్టుగ, ఈదుపురం, కొఠారీ, ధర్మపురం, రాజపురం పరిసర ప్రాంతాల్లో సంచరించింది. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎ.మురళీకృష్ణం నాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది ఆయా గ్రామాల్లో పెద్దపులి పాదముద్రలను గుర్తించారు. ఈ క్రమంలో అప్రమత్తంగా ఉండాలని ఆయా ప్రాంతాల వారిని అలర్ట్ చేశారు. అయితే, పులి సంచారంపై సోషల్ మీడియాలో వదంతులు సైతం అంతే వేగంగా షికారు చేస్తున్నాయి. తమ ప్రాంతంలో పులిని చూశామని కొందరు, తమ ప్రాంతంలో పులి పశువులపై దాడి చేసి చంపిందని ఇంకొందరు సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేస్తున్నారు. కాగా, కొన్నింటిపై ఎలాంటి అధికారిక సమాచారం ఉండడం లేదు. ఇలాంటి పుకార్లతో ఆయా ప్రాంతాల ప్రజలు మరింత ఆందోళనకు గురవుతున్నారు. సోషల్ మీడియాలో ఇలాంటి ఫేక్ వార్తలు ప్రచారం కాకుండా పోలీసులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. సోంపేట మండల పరిధిలోని మండపల్లి, చీకటి సోంపేట పరిసర ప్రాంతాల్లో పెద్ద పులి సంచారం ఉందని, ఇక్కడి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ అధికారులు సూచించారు. సాయంత్రం 5 తర్వాత ఉదయం 6 గంటల లోపు ఎవ్వరూ ఒంటరిగా తిరగొద్దని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితిలో మాత్రమే బయటకు రావాలని సూచించారు. రాత్రి సమయంలో పశువులను నివాస ప్రాంతాలకు దూరంగా విడిచిపెట్టొద్దని పోలీసులు సూచించారు. పెద్దపులిని పట్టుకోవడానికి అటవీ శాఖా, పోలీసులు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అప్పటి వరకు సోంపేట మండల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. పెద్దపులి సంచారం గురించి తెలిస్తే కంట్రోల్ రూమ్ ఫోన్ నెం. 94924 19724, 85010 08880కు సమాచారం ఇవ్వాలని కోరారుగత కొన్ని రోజుల నుంచి ఆంధ్రా, ఒడిశా సరిహద్దులో పులి సంచారం ఉందని, అక్టోబర్ 25న తొలిసారి పులి సంచారం గుర్తించినట్లు అటవీ శాఖ అధికారులు వెల్లడించారు. అప్పటి నుంచి పులి జాడ కనుక్కొనేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. పులి సంచారంపై ఆందోళన వద్దని, ఏవైనా అనుమానాస్పద గుర్తులు కనిపిస్తే అధికారులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. ఏమైనా పెంపుడు జంతువులపై పులి దాడి చేసి చంపేస్తే ప్రభుత్వం చట్ట ప్రకారం నష్టపరిహారం చెల్లిస్తుందన్నారు.

# నాలుగు స్థానాల్లో హ్యాట్రిక్ వీరులు

మెదక్ – ప్రభాత సూర్యుడు : ఉమ్మడిమెదక్ జిల్లాలో 10 నియోజకవర్గాలకు 8 స్థానాలలో అధికార బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే లు ఉన్నారు. ఈ ఎన్నికలలో ముఖ్యమంత్రి కేసీఆర్ 7 స్థానాలను సిట్టింగ్ ఎమ్మెల్యే లకు ఖరారు చేశారు. 4 స్థానాలలో ఎమ్మెల్యే లు ఈ సారి హ్యాట్రిక్ విజయాలపై కన్నేశారు. వారు మూడోసారి విజయం అందుకంటారా .. లేదా అన్నది తేలాలంటే మరి కొన్ని రోజులు ఆగాల్సి ఉంది.గజ్వేల్ లో ముఖ్యమంత్రి కేసీఆర్ మూడోసారి బరిలో ఉన్నారు. సిఎం 2014, 2018 ఎన్నికలలో గజ్వేల్ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. ఒకే స్థానం నుండి మూడుసార్లు గెలుపొంది హ్యాట్రిక్ సీఎంగా చరిత్ర సృష్టించాలని అయన గట్టి పట్టుదలతో ఉన్నారు.2014 లో తొలిసారిగా ఇక్కడి నుండి ఎమ్మెల్యేగా గెలిచిన కేసీఆర్, తెలంగాణాలో తోలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసారు. 2018 లో తన విజయాన్ని పునరావృతం చేసి మరోసారి ముఖ్యమంత్రి అయ్యారు.ఈ దఫా ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తూముకుంట నర్సారెడ్డి ఎంతమేరకు ప్రభావం చూపుతారో తెలీదు కానీ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ మాత్రం గట్టి పోటీ ఇస్తారని నియోజకవర్గంలో ప్రచారం జరుగుతోంది. సీఎం కేసీఆర్ 2014 లో 18 వేల ఓట్లతో గెలిచినా, 2018లో తన మెజారిటీని 58 వేల ఓట్ల కు పెంచుకున్నారు. మినీ ఇండియాగా పిలిచే పటాన్‌చెరు నియోజకవర్గంలో గూడెం మహిపాల్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీ నుండి వరుసగా మూడోసారి బరిలో ఉన్నారు. పటాన్‌చెరులో మహిపాల్ రెడ్డిపై బీజేపీ నుండి మాజీ ఎమ్మెల్యే అభ్యర్థి నందీశ్వర్ గౌడ్ పోటీలో ఉన్నారు.కాంగ్రెస్ అభ్యర్థిని ఇంకా అధిష్టానం ఖరారు చేయలేదు. 2018లో పోటీచేసిన కాటా శ్రీనివాస్ గౌడ్ కానీ, వారం రోజుల కింద కాంగ్రెస్‌లో చేరిన నీలంమధు కానీ పోటీలో ఉండవచ్చని పార్టీ కార్యకర్తలు అంటున్నారు. మహిపాల్ రెడ్డి ఇప్పటికే తన ప్రచారం ఉధృతం చేశారు.మెదక్ నియోజకవర్గం నుండి సిట్టింగ్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి ఆరో సారి ఎన్నికల బరిలో నిలిచారు. కానీ 2014, 2018 ఎన్నికలలో మెదక్ నుండి వరుసగా విజయం సాధించారు. 2014 లో గెలిచిన తర్వాత ఆమె శాసనసభ ఉపసభాపతిగా పనిచేశారు.ప్రస్తుతం హ్యాట్రిక్ విజయం దిశగా తన ప్రయత్నం ముమ్మరం చేసారు. మెదక్ లో రెండు సార్లు విజయం సాధించిన పద్మాదేవేందర్ రెడ్డి గెలుపు ఇప్పుడు అంత సులభమేం కాదంటున్నారు కాంగ్రెస్ నాయకులు. మెదక్ కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్ రావు ఈ సారి గట్టి పోటీ ఇచ్చే అవకాశం ఉన్నట్టు తెలుస్తుంది.నారాయణఖేడ్ లో సిట్టింగ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి వరుసగా మూడోసారి ఎన్నికల బరిలో నిలిచారు. 2014 ఎన్నికలలో కాంగ్రెస్ నుండి క్రిష్టా రెడ్డి ఎమ్మెల్యే గా గెలిచారు. 2015లో కృష్ణారెడ్డి గుండెపోటు తో మృతి చెందటంతో, ఆ తర్వాత 2016 లో జరిగిన ఉపఎన్నికలలో మహారెడ్డి భూపాల్ రెడ్డి బీఆర్ఎస్ నుండి పోటీ చేశారు.నాటి ఎన్నికల్లో కిష్టారెడ్డి కుమారుడు సంజీవ రెడ్డి పైన విజయం సాధించారు. 2018 లో కూడా బీఆర్ఎస్ నుండి పోటీ చేసి వరుసగా రెండుసార్లు ఎమ్మెల్యే గా గెలిసి, హ్యాట్రిక్ విజయ పై కన్నేశారు.

# అభ్యర్థుల ఎన్నికల వ్యయ ఖర్చులు ఖచ్చితంగా నమోదు చేయాలి

**సెంట్రల్ ఎక్స్పెండిచర్ అబ్జర్వర్ భేరా రామ్ చౌదరి**



నాగర్ కర్నూల్ – ప్రభాత సూర్యుడు : నాగర్ కర్నూలు జిల్లాలో శాసనసభ నియోజకవర్గాల్లో ఎన్నికలలో పోటీ చేయు అభ్యర్థుల ఖర్చుల వివరాలను నామినేషన్ వేసిన నుండి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఎన్నికల వ్యయ పరిశీలన బృందాలు ఖచ్చితంగా నమోదు చేయాలని భారత ఎన్నికల కమిషన్ నియమించిన జిల్లా వ్యయ పరిశీలకులు భేరా రామ చౌదరి అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ పి.ఉదయ్ కుమార్ జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ లతో కలిసి కేంద్ర ఎన్నికల వ్యయ పర్యవేక్షకులు భేరా రామ్ చౌదరి, శుక్రవారం ఐడిఓసి మినీ సమావేశ మంది రంలో జిల్లా ఎన్నికల పర్యవేక్షణ నోడల్ అధికారులు, నియోజకవర్గాల సహాయ వ్యయ పర్యవేక్షకులు, అకౌంటింగ్ టీంల సభ్యులతో సమావేశం నిర్వహించి వారి విధులపై సమీక్షించారు.ఈ సందర్భంగా సెంటర్ ఎక్స్పెండిచర్ అబ్జర్వర్ మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణ కోసం భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేయలెన్స్ టీం, వీడియో సర్వేయలెన్స్ టీం, వీడియో పరిశీలన టీం, అకౌంటింగ్ టీమ్ ల సభ్యులు జిల్లాలో సమర్థవంతంగా తమ బాధ్యతలను నిర్వర్తించేలా చూడాలని నోడల్ అధికారులను ఆదేశించారు. నాగర్ కర్నూలు జిల్లాలో నాగర్ కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట శాసన సభ నియోజకవర్గాకు జరగనున్న ఎన్నికలలో పోటీ చేయు రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ఆమోద, ఆమోద యోగ్యం కాని ఖర్చుల వివరాలను సహాయ వ్యయ పరిశీలకులు, అకౌంటింగ్ టీమ్, వి.ఎస్.టి., వి.వి.టిలు చేపట్టే నమోదు ప్రక్రియను చేయాలని అన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ద్వారా నిర్వహించు ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు, రోడ్ షోలు అన్నింటిని వీడియో సర్వేయలెన్స్ టీం సభ్యులు రికార్డింగ్ చేసి వీడియో పరిశీలన సభ్యుల ద్వారా సదరు వీడియో పరిశీలించి వివరాలను అకౌంటింగ్ టీం సభ్యులకు సమన్వయం చేసు కోవాలన్నారు. అకౌంటింగ్ టీం సభ్యులు వివరాలను షాడో అబ్జర్వేషన్ రిజిస్టర్ లో నమోదు చేయాలని తెలిపారు. అనంతరం పూర్తి వివరాలను రిటర్నింగ్ అధికారులకు సమర్పించాలని అన్నారు.ర్యాలీ లు , సమావేశాలు ద్వారా నిర్వహించిన పార్టీ, ప్రచార ఖర్చులు నిర్ణయించిన రేట్ ల ప్రకారం నమోదు చేయాలని అన్నారు. పోటీ చేయుఅభ్యర్థులు తమ ప్రచార వ్యయ ఖర్చుల వ్యయ అకౌంట్ లు, రిజిష్టర్ లు సక్రమంగా నిర్వహించాలని అన్నారు.వ్యయ పరిశీలకులు అభ్యర్థుల ఖర్చులను నామినేషన్ వేసిన తర్వాత ఎన్నికల సందర్భంగా, ఎన్నికల అనంతరం పరిశీలన చేయనున్నారని, పరిశీలనకు మధ్య మూడు రోజుల వ్యవధి ఉండాలని ఆయన స్పష్టం చేశారు .అనుమతి తీసుకున్న వాహనాలు కంటే ఎక్కువ ఉపయోగించిన ఖర్చులు నమోదు చేసి అనుమతి రద్దు చేయాలని అన్నారు. ఒకరు అనుమతి తీసుకున్న వాహనం వేరే అభ్యర్థి ఉపయోగించ రాదని, ఆ అభ్యర్థి వ్యయంలో ఖర్చు నమోదు చేసి అనుమతులు రద్దు చేయాలని అన్నారు.కరపత్రాలు, పోస్టర్‌లు, ఫ్లెక్సులు ముద్రించినపడు ప్రింటర్ మరియు ప్రచురణకర్తలు ఎన్నికల ప్రజా ప్రాతినిధ్య చట్టం1951 ప్రకారం నిబంధనలు పాటించాలని అన్నారు. ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో ఎన్నికల లో ప్రకటనలు జిల్లా మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్‌కమిటీ సర్టిఫికేషన్ చేయనున్నట్లు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా లో ప్రకటనలు ఎన్నికల సంఘం విడుదల చేసిన రేట్ల ప్రకారం ఎన్నికల వ్యయం నమోదు చేయడం జరగాలి అన్నారు.ఓటర్లను ప్రలోభ పరిచేలా డబ్బు,మద్యం పంపిణీపై ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, ఎస్.ఎస్.టిలు తనిఖీలు పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు.అదే విధంగా ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు ఉచితంగా అంద చేసే కానుకలు అనగా చీరలు, కుట్టు మిషన్ లు, స్పోర్ట్స్ కిట్ లు, గడియారం లు, బొమ్మలు, టార్చి లైట్ లు, గొడుగు లు, ఆభరణాలు, సైకిల్స్, కాస్మెటిక్స్, స్కూల్ బ్యాగ్ లు, సెల్ ఫోన్ లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, టీ షర్ట్ లు, మిక్సీ గ్రైండర్ లు వంటివి పంపిణీ చేయకుండా కట్టు దిట్ట మైన చర్యలు తీసుకోవాలని అన్నారు.జిల్లా వ్యయ పరిశీలన కమిటీ నోడల్ అధికారి జిల్లా సహకార అధికారి శ్రీనివాస్ బాబు, సహాయ వ్యయ అధికారులతో సమన్వయం చేసుకోవాలని, సహాయ వ్యయ పరిశీలన అధికారులు రిటర్నింగ్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని అన్నారు. అనుమానాస్పద బ్యాంక్ లావా దేవీ లు,10 లక్షల కంటే మించి నగదు జమ ,ఉపసంహరణ, ఆన్లైన్ ద్వారా మల్టిపుల్ లావా దేవీ లపై పర్యవేక్షణ చేయాలని అన్నారు.ఐన్ కం టాక్స్, వాణిజ్య పన్నుల శాఖ, వ్యయ పరిశీలన శాఖలు ఎన్నికల వ్యయం నమోదులో సమన్వయము తో పని చేయాలని అన్నారు.ఎం సి ఎం సి కమిటీ ద్వారా రోజువారి దిన పత్రికల్లో వచ్చే ఫెడ్ న్యూస్ పై దృష్టి సారించాలన్నారు. సోషల్ మీడియా పై పటిష్టంగా ఉంచాలన్నారు.

## కాకర్లపల్లి గ్రామంలో
# బిఆర్ఎస్ ఇంటింటి ప్రచారం



**మంథని - ప్రభాత సూర్యుడు :** మంథని మండలం కాకర్లపల్లి గ్రామంలో తెలంగాణ ముఖ్యమంత్రి,బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ప్రవేశపెట్టిన మేనిఫెస్టో ప్రతులను విడుదల చేసి గడపగడపకు టిఆర్ఎస్ మేనిఫెస్టోను మండల పార్టీ అధ్యక్షుడు ఏగోళపు శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు నాయకులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పుట్ట మధు ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో ఇప్పుడు చేసిన అభివృద్ధి కార్యక్రమాలపై విస్తృత ప్రచారం చేయాలని కార్యకర్తలకు సూచించారు. పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్ట్ నుండి అనేక కార్యక్రమాలు నిర్వహించిన ఘనత పుట్ట మధుకే దక్కిందన్నారు. టిఆర్ఎస్ పార్టీ అమలు చేస్తున్న పథకాలపై కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్,రైతుబంధు, రైతు బీమా,దళిత బంధు, బీసీ బందు,మైనారిటీ బందు, గృహలక్ష్మి అనేక పథకాలపై విస్తృతంగా ప్రజల ముందు ఉంచాలని కోరారు. పుట్ట మధుకర్ ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మన గ్రామాలు మరింత అభివృద్ధి చెందు తాయన్నారు. బిఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేసి పుట్ట మధు ను మంథని నియోజకవర్గ ఎమ్మెల్యేగా బారి మెజారిటీ తో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కన్నవేన పద్మ కొమురయ్య, మంథని నియోజకవర్గ ప్రచార అధ్యక్షుడు సెగ్గం రాజేష్.మండల పార్టీ ఉపాధ్యక్షుడు వేల్పుల గట్టయ్య,మండల బిసి సెల్ ఉపాధ్యక్షుడు ఆకుల మల్లయ్య,సాయి,బాపు, మల్లారం బాపు, రవి,సురేష్,మహేందర్ గ్రామ ప్రజలు కార్యకర్తలు పుట్ట మధుకర్ అభిమానులు పాల్గొన్నారు.

## కేసీఆర్ సమక్షం లో
# బిఅర్ఎస్ పార్టీలో చేరిన కాసాని జ్ఞానేశ్వర్

**-ముదిరాజ్ సామాజిక వర్గం నుంచి ఈటల రాజేందర్ ఎవ్వరిని ఎదగనివ్వలేదు**
**నామినేటెడ్ పోస్టులో ముదిరాజ్ లకు సముచిత స్థానం**
**కాసానికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన సీఎం కేసీఆర్**

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు:** కేసీఆర్ సమక్షం లో బిఅర్ఎస్ పార్టీలో చేరిన కాసాని జ్ఞానేశ్వర్ బిఅర్ఎస్ పార్టీ లో చేరారు. ఫాం హౌస్ లో కాసాని జ్ఞానేశ్వర్‌ను సీఎం కేసీఆర్ పార్టీలోకి ఆహ్వానించి, గులాబీ కండువా కప్పారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ ముదిరాజ్ సామాజిక వర్గం నుంచి ఈటల రాజేందర్ ఎవ్వరిని ఎదగనివ్వలేదు అని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. బండా ప్రకాశ్ ముదిరాజ్ లాంటి వాళ్లను పార్టీలోకి తీసుకొచ్చి పదవులు ఇచ్చామని, కాసాని జ్ఞానేశ్వర్‌కు అవకాశాలు ఉంటాయని కేసీఆర్ పేర్కొన్నారు. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన బండా ప్రకాశ్‌ను ఎంపీ చేసుకున్నాం. ఆ తర్వాత ఎమ్మెల్సీ చేసుకున్నాం. ఇప్పుడు మండలి వైస్ చైర్మన్‌గా నియమించుకున్నాం. మీకు రాజకీయాలు తెలుసు.. మనకున్నవి మొత్తం 119 సీట్లు.. అందులో ఏడు మనవి కావు. మనకున్నది కేవలం 112 సీట్లు. ఆ సీట్లలో పెట్టిన వ్యక్తి పక్కా గెలవాలి. ఏదో తమాషాకు అభ్యర్థిని బరిలో దింపి, ఆ సీటును కోల్పోయి, పార్టీకి నష్టం చేకూర్చోవడం రాజకీయం కాదు.ఎన్నికల తర్వాత హైదరాబాద్‌లో అందరం కలిసి కూర్చుందాం. ఎన్టీ రామారావు పీరియడ్‌లో లోకల్ బాడీ ఎలక్షన్స్‌లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేసి సాధించాం. దాంతో కొంత మంది రాజకీయ నాయకులు ఎదిగారు. రాజకీయంగా రాబోయే రోజుల్లో చాలా పదవులు ఉంటాయి. చాలా అవకాశాలు ఉంటాయి. ముదిరాజ్ సామాజిక వర్గం పెద్దది కాబట్టి ఆ వర్గం నుంచి మనం నాయకులను తయారు చేసుకోవాలి. జిల్లాకు ఒకరిద్దరిని తయారు చేసుకుంటే పార్లమెంట్‌కు పెట్టుకోవచ్చు.. అసెంబ్లీకి పెట్టుకోవచ్చు. ఎమ్మెల్సీలు కూడా కావొచ్చు.. అలా చాలా అవకాశాలు ఉంటాయి. రాజేందర్ అటు పోయినా.. పెద్ద మనిషి కాసాని జ్ఞానేశ్వర్ పార్టీలో చేరడం మంచి పరిణామం అని సీఎం కేసీఆర్ అన్నారు.

## చిన్న నారాయణపురంలో మండలి ఛైర్మన్ పర్యటన



**నార్కట్ పల్లి ప్రభాత సూర్యుడు :** నార్కట్ పల్లి మండలం చిన్ననారాయణపురం గ్రామ సర్పంచ్ కొత్త నరసింహ యాదవ్ ని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పరామర్శించారు. ఇటీవల ఆయన భార్య ఇంద్రబాయి గుండెపోటు కారణంగా మరణించారు. నేడు చిన్న నారాయణ పురం వెల్లిన గుత్తా సుఖేందర్ రెడ్డి వారి ఇంటికి వెళ్లి ఇంద్రబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దుఃఖంలో ఉన్న సర్పంచ్ కొత్త నర్సింహ, అతని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టే మల్లిఖార్జున్ రెడ్డి ,స్థానిక బి ఆర్ యస్ పార్టీ నేతలు, గుండె రవి ,తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ వేసిన మాజీ మంత్రి తుమ్మల

**ఖమ్మం - ప్రభాత సూర్యుడు:**మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం నాడు కాంగ్రెస్ పార్టీ అబ్యర్ధిగా నామినేషన్ దాఖలు చేసారు. తరువాత అయన మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ వేశాను. ఖమ్మం భవిష్యత్ కోసం,ప్రజల అవసరాల మనోభావాలు కాపాడటం కోసం పనిచేస్తాను. మీ ఆశలకు, అవసరాలకు కోసం పనిచేస్తా. తెలంగాణ ప్రజలు అందరూ నీతి వంతమైన పాలన కోసం ఎదురు చూస్తున్న రు. తెలంగాణ ఇచ్చిన పార్టీ కోసం ఎదురుచూస్తుంది. కాంగ్రెస్ పార్టీని ఈఎన్నికల్లో గెలిపించాలి. కేసీఆర్ నిరంకుశ పాలన కు చరమగీతం పాడాలని అన్నారు.

# మోసగాళ్ల నీతిమాటలపై ఆలోచన చేయాలే

- **బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే ప్రజా సంక్షేమ పథకాలు అమలు**
- **మీ ఆశీర్వాదంతో భవిష్యత్ తరాలకు బంగారు బాటలు వేస్తా**
- **కార్నర్ మీటింగ్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్**



**మంథని - ప్రభాత సూర్యుడు :** సమాజంలో అబద్దాలే రాజ్యమేలుతున్నాయని, మోసగాళ్లే నీతి మంతుల్లా మాట్లాడుతున్న తీరుపై ప్రజలు ఆలోచన చేయాలని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో బాగంగా శుక్రవారం మంథని మున్సిపల్ పరిధిలోని పోచమ్మవాడ, మహాలక్ష్మి దేవాలయం ఏరియా, వడ్ల వాడ, ఉస్మాన్ పుర, సుభాష్ నగర్, మర్రి వాడ, అంబేద్కర్ నగర్, ముత్యాలమ్మ వాడ.....ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లకు మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజతో కలిసి ఆయన పాల్గొన్నారు. ముందుగా ఆయా వార్డుల్లో ప్రజలను కలుస్తూ పర్యటించారు. అనంతరం ప్రధాన కూడలిలో ఆయన మాట్లాడుతూ మంథని ప్రజలను అమాయకులని బావించిన కాంగ్రెస్సోళ్లు మళ్లీ మళ్లీ మోసం చేస్తూనే ఉన్నారని అన్నారు. మనం ఆలోచన చేయకపోతే పెద్ద ప్రమాదం పొంచి ఉందన్న విషయాన్ని చెప్పడం నా బాధ్యతగా మీ ముందుకు వచ్చానని ఆయన అన్నారు. 55ఏండ్లలో ఎమ్మెల్యేగా, సర్పంచ్‌లుగా కాంగ్రెస్ పార్టీ వాళ్లే పాలన చేశారని, ఆనాటి నుంచి ఈనాటి వరకు కాంగ్రెస్సోళ్లు మంథనికి ఏం చేశారో చూశారని అన్నారు. అనేక ఏండ్లు కాంగ్రెస్ పాలనతో మంథని ప్రజలు కష్టాలు, ఇబ్బందులు అనుభవించిన విషయం వాస్తవం కాదా అన్నారు. మన ఓట్లతో గెలిచి పదవులు పొందినోళ్లు మన ప్రాంతానికి చేసిందేమీ లేదన్నారు. మంథనిలో అత్యధికంగా ఉన్న బీసీలు, కాపులపై కాంగ్రెస్సోళ్లు కక్ష్యసాధించారని, మన కులాన్ని ద్వేషించారని, చులకనగా చూసినోల్లు మళ్లీ ఓట్ల కోసం వస్తున్నారని ఆయన అన్నారు. 2009లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయానని, మళ్లీ 2014లో పోటీ చేస్తే మంథని ప్రజలు ఆదరించి ఆశీర్వదించారని అన్నారు. మీ ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా అయిన నాలుగేండ్లలో అనేక అభివృద్ధి పనులు చేశామని, పేదలకు తనవంతు సేవలు అందించానని ఆయన గుర్తు చేశారు. మంథని మున్సిపల్ పరిధిలోని పోచమ్మవాడ ప్రజలు ఎంతో ప్రోత్సాహం అందించారని, వారి రుణం ఎన్ని జన్మలెత్తినా తీర్చుకోలేనిదన్నారు. మళ్లీ ఈసారి కూడా పోచమ్మవాడ ప్రజలు ముందుకొచ్చి తనకు మద్దతుగా నిలువడం ఆనందంగా ఉందన్నారు. నిన్నా మొన్నటి వరకు ఏ సాయం అడిగినా పైసా లేదని, ఏ పని అడిగినా మా ప్రభుత్వం లేదని చెప్పినోళ్లు ఎన్నికలు వస్తున్నాయని ఓట్ల కోసం నోట్ల సంచులతో తిరుగుతున్నారని, నాయకులను కొనుగోలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన అన్నారు. ఇన్నేండ్ల కాలంలో ఏనాడైనా మన బిడ్డల చదువులకు, పెండ్లిళ్లకు, ఆస్పత్రుల్లో వైద్యానికి పైసా సాయం చేశారా అని ఒక్కసారి ఆలోచన చేయాలని అన్నారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో ఓట్ల కోసం వచ్చిన నాయకులు మళ్లీ నాలుగేండ్ల తర్వాత మన వాడల్లో ఓట్లకోసం అడుగు పెట్టారనే విషయాన్ని గుర్తించాలన్నారు. 76ఏండ్లలో మంథని చరిత్రలో ఒక బీడ్డగా తాను ఈ స్థాయికి ఎదిగానని, కాంగ్రెస్‌ను నమ్మిమోసపోతే మళ్లీ ఓ బీసీ బిడ్డ ఎదుగాలంటే మరో 76ఏండ్లు పడుతుందని, బీసీలకు ఎదిగే అవకాశం ఇవ్వరని ఆయన అన్నారు. ఓట్ల కోసం అన్నం పెట్టనోళ్లు ఆరు అబద్దాల పథకాలతో వస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ పథకాలు తప్ప ఇక్కడి ఎమ్మెల్యే సొంతంగా ఏమీ చేస్తారో, ఇప్పటి వరకు ఏం చేశారో చెప్పడం లేదని విమర్శించారు. వాళ్లు ఏమీ చేయరని, చేసే వాళ్లను అడ్డుకుంటారని ఆయన స్పష్టం చేశారు. తొమ్మిదేండ్ల బీఆర్ఎస ప్రభుత్వం, సీఎం కేసీఆర్ నాయకత్వంలో మంథనిని అన్నివిధాలుగా అభివృద్ధి చేశామని, మీ ఇంటి ముందే అబివృద్ధి ఆనవాళ్లు కన్పిస్తాయని ఆయన గుర్తు చేశారు. ఆనాడు మంత్రిపదవిలో ఉన్నోళ్లను గడ్డిపరకలెక్క పక్కన పెట్టి సర్పంచ్‌గా గెలిపించుకున్న మంథని ప్రజలు ఒక్కతాటిపైకి రావాలని, కాపుల సత్తా చాటాలని ఆయన పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే సంక్షేమ పథకాలు అమలు అవుతాయని, బీఆర్ఎస్ ఎన్నికల మేనీఫోస్టలో పొందుపర్చిన ప్రతి పథకం ప్రతి కుటుంబానికి భరోసా ఇస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలతో పాటు తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే మరిన్న సొంత పథకాలు అమలు చేస్తానని, పేదవర్గాలకు ఇంటి నిర్మాణాలు, ఆడబిడ్డల పెండ్లిళ్లు, బీదబిడ్డలకు ఉన్నత చదువులు చదివించేబాధ్యత తీసుకుంటానని ఆయన హమీ ఇచ్చారు. అబద్దాల కాంగ్రెస్‌కు చరమగీతం పాడి మంథనికి వెలుగులు వచ్చేలా బీఆర్ఎస్ పార్టీని, తనను ఆశీర్వదించి ఆదరించాలని ఆయన కోరారు. అలాగే ఈనెల 7న మంథనిలో నిర్వహించే ముఖ్యమంత్రి కేసీఆర్ సభకు బారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.



## కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో
# ముగిసిన రాజశ్యామల యాగం

- **సశాస్త్రీయంగా మహా పూర్ణాహుతి**
- **తెలంగాణకు మంచి జరగాలని కోరుకున్నామన్న స్వరూపానందేంద్ర**



**ఎర్రవల్లి - ప్రభాత సూర్యుడు :** ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో విశాఖ శ్రీ శారదాపీఠం చేపట్టిన రాజ శ్యామలా సహిత సుబ్రహ్మణ్యేశ్వర యాగం ముగిసింది. వైదిక నియమాలను అనుసరిస్తూ మూడు రోజులపాటు యాగాన్ని నిర్వహించారు. శుక్రవారం మధ్యాహ్నం మహా పూర్ణాహుతితో యాగ క్రతువు పూర్తయింది. తెలంగాణ ప్రజలందరినీ రాజశ్యామల అమ్మవారు అనుగ్రహించాలని ముఖ్య మంత్రి కేసీఆర్ ఈ యాగాన్ని నిర్వహించారని పీఠాధిపతులు స్వరూపానందేంద్ర స్వామి తెలిపారు. తెలంగాణ అభివృద్ధికి కంకణం కట్టుకున్న నాయకుడు కేసీఆర్ అని ప్రశంసించారు. సశాస్త్రీయంగా యాగాన్ని పూర్తి చేసామని స్పష్టం చేసారు. ఈ యాగంతో తెలంగాణలో అద్భుత ఘట్టం ఆవిష్కృతం అవుతుందని చెప్పారు. మహా పూర్ణాహుతి అనంతరం యాగంలో మంత్రించిన జలాలను కేసీఆర్ దంపతులపై చల్లారు. యాగ భస్మాన్ని కేసీఆర్ నుదుట దిద్దారు.వేదోక్తంగా మహా పూర్ణాహుతి యాగశాలలో రాజశ్యామల అమ్మవారు శుక్రవారం నర్తనకాళి అలంకరణలో దర్శనమిచ్చింది. వేకువజాము నుంచే రాజశ్యామల, సుబ్రహ్మణ్యేశ్వర మూల మంత్రాల హవనం ప్రారంభమైంది. పూర్ణాహుతి ముహూర్త సమయానికి నిర్దిష్ట సంఖ్యలో హవనాలను పూర్తి చేసారు. మహా పూర్ణాహుతిలో కేసీఆర్ దంపతులతో పాటు బంధుమిత్రులు, సన్నిహితులు పాల్గొన్నారు. పూర్ణాహుతిలో వినియోగించే పసుపు, కుంకుమ, సుగంధ ద్రవ్యాలకు పీఠాధిపతులు స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర సమక్షంలో కేసీఆర్ దంపతులు పూజలు చేసారు. అష్టదిక్పాలకులకు ఆర్ఘ్యం సమర్పించారు. అనంతరం పూర్ణాహుతి జరిపారు. కేసీఆర్ దంపతులు ధరించిన కంకణాలను విసర్జి ంచడం ద్వారా యాగం పూర్తయింది. అనంతరం స్వరూపానందేంద్ర స్వామికి పాదపూజ చేసి కేసీఆర్ పుష్పాభి షేకంతో గురు వందనం సమర్పించారు. ఈసందర్భంగా శూలినీ దుర్గ కవచంతో అభి మంత్రించిన రక్షను స్వరూపానందేంద్ర స్వామి కేసీఆర్కు కట్టారు. అలాగే విశాఖ శ్రీ



శారదాపీఠం నుండి ప్రత్యేకంగా రప్పించిన రాజశ్యామల అమ్మవారి శేష వస్త్రాలను స్వరూపానందేంద్ర స్వామి కేసీఆర్ దంపతులకు అందించారు. శుభానికి సూచికగా పండితులంతా పసుపు వస్త్రాలను ధరించి యాగానికి హాజరయ్యారు

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215